

వసపలో ఏనుగులు



సంచరిస్తున్న ఏనుగులు

కొత్తూరు: కొద్ది రోజుల క్రితం పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో నాలుగు ఏనుగులు గుంపు వివిధ పంటలు నాశనం ధ్వంసం చేశారు. అక్కడి నుంచి బుధవారం సాయంత్రం కొత్తూరు మండలంలో కడుము, హంస నదీ తీర ప్రాంతాల్లోకి ప్రవేశించారు. ఆ పరిసరాల్లోని జొన్న పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గురువారం ఉదయం వసపలో ఏనుగులు సంచరించాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ స్థానికులు గడుపుతున్నారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు పరిశీలించి ఏనుగులకు కవ్వింపు చర్యలు చేపట్టరాదని ప్రజలకు సూచిస్తున్నారు. రైతులకు పంట నష్టపరిహారం చెల్లిస్తామని తెలిపారు.

సామాన్య రైతుకు సాయం అందేనా?

- సబ్సిడీపై వ్యవసాయ పరికరాల అందజేతకు ప్రభుత్వ నిర్ణయం
- జిల్లాకు 1903 యూనిట్లు లక్ష్యం
- ఈనెల 26 లోగా ఆర్‌ఎస్‌కెల్లో దరఖాస్తులకు అవకాశం
- అప్పుడే మొదలైన సిఫార్సులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లో కలిపి సుమారు 6.20 లక్షల ఎకరాల్లో పలురకాల వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. వీటితోపాటు జిల్లాలో లక్ష ఎకరాల్లో కొబ్బరి, జీడి, మామిడి తదితర పంటలు సాగవుతున్నాయి. 249 ఎకరాల్లో పట్టు సాగవుతోంది. లక్షల ఎకరాల్లో వరి, ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పంటల సాగు సందర్భంలో రైతులు ట్రాక్టర్లు, రోటోవేటర్లు, దుక్కు, దమ్ము, నాట్లు, కలుపు తీసే యంత్రాలను కొందరు చేతి డబ్బులు పెట్టుకుని కొనుక్కోవాల్సి వస్తోంది. మరికొందరు అద్దెకు తీసుకుని వినియోగిస్తున్నారు. రైతులపై భారం తగ్గించడంతో పాటు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రైతులకు యంత్ర పరికరాలను ప్రభుత్వాలు అందిస్తూ వస్తున్నాయి. గత వైసిపి ప్రభుత్వం రాయితీపై కాకుండా అద్దె ప్రాతిపదికన రైతులకు యంత్ర పరికరాలను అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం రైతు సేవా కేంద్రాల్లో కస్టమ్ హైరింగ్ సెంటర్లు (సిహెచ్‌సి)ను ఏర్పాటు చేసి రూ.15 లక్షల వరకు విలువ చేసే యంత్రాలను రైతులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. రైతు సంఘాలనూ ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియనూ పూర్తి చేశారు. రైతులకు మాత్రం పరికరాలను అందించలేదు.

జిల్లా లక్ష్యం 1903 యూనిట్లు

వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాకు సంబంధించి 1903 యూనిట్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం జిల్లాకు రూ.2.87 కోట్లను కేటాయించింది. మండలాల వారీగా లక్ష్యాలను రూపొందించి అర్హులైన రైతులను ఎంపిక చేయనున్నారు. బ్యాటరీ స్ప్రేయర్స్‌ను 600 మందికి, పవర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్‌ను 500 మందికి, ట్రాక్టర్‌తో నడిచే యంత్రాలను 730 మందికి అందించనున్నారు. వీటితోపాటు పవర్ టిల్లర్స్ పది మందికి, బ్రష్ కట్టర్స్ 15 మందికి ఇవ్వనున్నారు. రైతులు తమకు కావాల్సిన పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యంత్ర పరికరాల పంపిణీ కోసం ప్రభుత్వం జిల్లాలో పది మంది డీలర్లను ఎంపిక చేసింది. రైతు తనకు నచ్చిన ఏజెన్సీ నుంచి పరికరాలను పొందే వెసులుబాటు కల్పించింది. పరికరం రకాన్ని బట్టి 40 నుంచి 50 శాతం సబ్సిడీ చెల్లించనుంది. సబ్సిడీయేతర మొత్తాన్ని సంబంధిత డీలర్లకు చెల్లించి పరికరాలను తీసుకోవాల్సి ఉంటుంది.

అప్పుడే మొదలైన సిఫార్సులు

ప్రభుత్వం సబ్సిడీపై అందించనున్న యంత్ర పరికరాలపై రైతుల్లో చాలా డిమాండ్ నెలకొంది. ఎంపిక కోసం ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలను సూచించింది. రైతు గత ఐదేళ్లలో యంత్ర పరికరాలను తీసుకొని ఉండకూడదని షరతు విధించింది. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇవ్వనున్నట్లు పేర్కొంది. నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తే సామాన్య రైతులకు సైతం మేలు చేకూరుతుంది. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వ హయాంలో రాజకీయ సిఫార్సులున్న వారికే కట్టబెట్టారన్న విమర్శలు వెల్లువెత్తాయి. టిడిపి నేతల ఇళ్లలో పరికరాలు దర్శనం ఇచ్చిన ఘటనలు వెలుగు చూశాయి. ఇప్పుడూ అదే కథ పునరావృతం అవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

> **రైతులకు వ్యవసాయ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం పలురకాల యంత్ర పరికరాలను అద్దె ప్రాతిపదికన అందించాలని గతంలో వైసిపి ప్రభుత్వం నిర్ణయించినా, అది ఆచరణకు నోచుకోలేదు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పరికరాలను అందించాలని నిర్ణయించింది. రైతులకు ఎటువంటి పరికరాలు అవసరమో వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి, ప్రభుత్వానికి ఐదు నెలల కిందటే నివేదిక పంపారు. ప్రభుత్వం ఆమోదం తెలపడంతో రైతులకు వాటిని అందించేందుకు అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. ఈనెల 26వ తేదీ లోపు రైతుసేవా కేంద్రాల్లో (ఆర్‌ఎస్‌కె) దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.**



మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రీ సర్వేలో తప్పులను సరిచేయాలి

జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

భూ రీ సర్వేలో దొర్లిన తప్పులను సరిచేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో గురువారం జిల్లా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది అలసత్వం విడనాడి లక్ష్యాలను అందుకోవాలన్నారు. ఏ రకమైనా ఫిర్యాదులు వచ్చినా నిర్ణీత గడువులోగా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఈ నెల 23, 24 తేదీల నాటికి అమరావతిలో నిర్వహించనున్న కలెక్టర్ల సదస్సు నిర్వహించనున్నారని, అప్పటిలోగా అన్ని రకాల ఫిర్యాదులూ పరిష్కరించాలని సూచించారు. మండలానికి ఓ గ్రామం పైలెట్ ప్రాజెక్టు గతంలో స్వీకరించామని, అయితే కొన్ని తప్పిదాలు చోటు చేసుకున్నాయని, ఈ సారి ఆ తప్పిదాలు లేకుండా చూడాలని సూచించారు. రెండో విడతలో రెండు గ్రామాలను ఎంపిక చేసి రీ సర్వే చేపట్టి అన్ని రకాల పిటిషన్లను పరిష్కరించాలన్నారు.

విఆర్‌ఒలు, సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే పోర్టు వివాదాల పరిష్కారం, గ్రామసభల అర్జీలపై చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒలు ఎం.కృష్ణమూర్తి, సాయిప్రత్యూష, ఎస్‌ఒసి పద్మావతి, సర్వే ఎడి కుప్పుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హోలీ చేసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రంగుల పండగ హోలీని జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా చేసుకోవాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరంగా ప్రవర్తించరాదని, ఆకతాయి చర్యలకు పాల్పడరాదని పేర్కొన్నారు. కలుషితమైన, ప్రమాదకరమైన రంగులు వినియోగించవద్దని పర్యావరణ హితమైన రంగులు మాత్రమే వాడాలని సూచించారు. మత సామరస్యాన్ని పాటిస్తూ సోదరభావంతో పండుగ చేసుకోవాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

ప్రజాశక్తి - పలాస

ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమాన్ని ఈనెల 14వ తేదీన హోలీ సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ విషయాన్ని గమనించి వినతులు అందజేసేందుకు రావద్దని కోరారు.

పోర్టు నిర్వాసితులకు ఫ్లాట్ల కేటాయింపు

క్లస్టర్ వారీగా 80 మంది లాటరీ ద్వారా ఎంపిక

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని మూలపేట పోర్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసిత గ్రామస్తులకు ప్రభుత్వం ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టింది. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి ఆధ్వర్యాన నౌపడలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో విష్ణుచక్రం గ్రామ పెద్దలు, నిర్వాసితుల సమక్షంలో లాటరీ తీసి వారి ప్లాట్ల నంబరు ప్రకారం స్థలాన్ని ప్రకటించారు. నౌపడలో నిర్మిస్తున్న ఆర్ అండ్ ఆర్ కాలనీలో బిసి, ఎస్‌సి క్లస్టర్ వారీగా 28 క్లస్టర్లతో ప్లాట్లను డిజైన్ చేశారు. అందులోని ఒక క్లస్టర్‌లో లాటరీ పద్ధతిలో 80 మంది నిర్వాసితులకు ప్లాట్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా ఫ్లాట్లను కేటాయించామన్నారు. ఆరు నెలల్లో ప్రస్తుతం నివాసం ఉంటున్న గ్రామాన్ని ఖాళీ చేసి కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని నిర్వాసితులను కోరారు. ప్రభుత్వం నిర్వాసితులు కోరుకున్నట్లుగానే నౌపడలో రూ.35 కోట్లతో 55 ఎకరాల్లో అత్యాధునిక వసతులతో ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం చేపడుతుందని చెప్పారు. ఇందులో భాగంగా సిసి రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైనేజీలు, ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు, ఆటస్థలం, పాఠశాలలు, ఆలయాలతో పాటు గ్రామానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

మొదటి విడతలో 80 మంది ఎంపిక

మూలపేట నిర్వాసిత గ్రామాలైన మూలపేట, విష్ణుచక్రంలో మొత్తం 598 మంది నిర్వాసిత కుటుంబాలకు పిడిఎఫ్‌లుగా గుర్తించారు. వీరి కోసం నౌపడ నిర్వాసిత కాలనీ నిర్మించి బిసి, ఎస్‌సిల వారీగా 28 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. తొలి విడతలో భాగంగా విష్ణుచక్రం గ్రామంలోని 80 మంది నిర్వాసితులకు ఫ్లాట్లను పంపిణీ చేశారు. లాటరీ ద్వారా ఎంపికైన నంబర్ల ప్రకారం త్వరలోనే వీరికి ఐదు సెంట్లు చొప్పున స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నారు. పత్రాలు అందుకున్న ఆరు నెలల్లోనే ఇళ్ల నిర్మాణం చేసుకోవాలని అధికారులు సూచించారు. దీనిపై నిర్వాసితులు ఇళ్ల నిర్మాణానికి సమయం పొడిగించాలని కోరారు. పోర్టు నిర్మాణంలో కీలక విభాగానికి ప్రస్తుతం ఉన్న విష్ణుచక్రంలోనే నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండడంతో త్వరితగతిన గ్రామాన్ని ఖాళీ చేయాలని అధికారులు చెప్పారు. మరోవైపు మూలపేట గ్రామంలో 510 పిడిఎఫ్ కుటుంబాలకు ఫ్లాట్ల కేటాయించాల్సి ఉండగా, ప్రస్తుతానికి విష్ణు చక్రం గ్రామస్తులను తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆర్‌డిఒ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ రామకృష్ణ, పంచాయతీరాజ్ డిఇ సుధాకర్, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ జయంతి ప్రసాద్, రెవెన్యూ, సర్వే అధికారులు, నౌపడ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

జీవనశైలి మార్పుతో కిడ్నీ వ్యాధి దూరం

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కిడ్నీ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దీని బారిన పడకుండా ఉండేందుకు జీవనశైలి మార్చుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా స్థానిక జిజిహెచ్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కిడ్నీ వ్యాధులపై మరిన్ని పరిశోధనలు చేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో పలు సంస్థలు రానున్నాయన్నారు. కిడ్నీ వ్యాధిని త్వరగా గుర్తించేందుకు హార్వర్డ్, నార్త్ కెరోలీనా, కొలంబియా సెంటర్ ఫర్ సెల్యులర్ మాలిక్యులర్ బయాలజీ, ఐఎఎస్‌సి బెంగుళూరు యూనివర్సిటీలతో వారందరితో కలిపి పరిశోధనలు చేసే ఆలోచనతో ఉన్నట్లు వివరించారు. ఉప్పు తక్కువగా వాడడం, రోజూ తాగునీరు తగు మోతాదులో తీసుకొని ప్రతిరోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. కిడ్నీ సమస్యను గుర్తించేందుకు ఏటా కిడ్నీ పరీక్షలు చేయిస్తే మొదటి దశలోనే గుర్తిస్తే వైద్యులు సులువుగా వైద్యం చేస్తారని వివరించారు. జిజిహెచ్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఆల్కహాల్, పొగ తాగడం ఆపాలని, జీవన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కిడ్నీ వ్యాధికి 60 శాతం కిడ్నీ వ్యాధి హైపర్ టెన్షన్, షుగర్‌లే కారణమన్నారు. ఇవి కంట్రోల్‌లో ఉంటే 60 శాతం కిడ్నీ వ్యాధిని ఆపవచ్చని తెలిపారు. స్పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీ వ్యాధి వస్తుందన్నారు. ఉద్దాన ప్రాంతంలో వచ్చే కిడ్నీ వ్యాధులకు వేరే కారణాలు ఉన్నట్లు పరిశోధనలో తేలినట్లు వివరించారు. ఈ ప్రాంతంలో వచ్చే కిడ్నీ వ్యాధి లక్షణాలు కనబడవని, కాలు వాపులు, అలసట, తదితరమైన లక్షణాలు ఉండవన్నారు.

అనుమానం వచ్చి పరీక్షలు చేస్తే క్రియాటిన్ 3 లేదా 4 ఉంటుందని చెప్పారు. డిసిహెచ్ డాక్టర్ కళ్యాణ్ బాబు, జిజిహెచ్ సూపరింటెండెంట్ షకీల మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 106 వరకు డయాలసిస్ యూనిట్లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 12 రకాల మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ర్యాలీలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బాలమురళీకృష్ణ, నెఫ్రాలజిస్ట్ కొర్ల విద్యాసాగర్, డాక్టర్ శరత్ జ్యోత్స్న, అన్ని విభాగాల వైద్యులు, మెడికల్ కళాశాల అధ్యాపకులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

విద్యార్థులను వేధిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదో తరగతి వార్షిక పరీక్షల హాల్ టిక్కెట్ల జారీలో ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయన్న నెపంతో విద్యార్థులను వేధిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్ టిక్కెట్లలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతకాలు, స్టాంపులు ఉండాలని నిబంధనలు పెట్టి విద్యార్థులను మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్ల జారీ ప్రక్రియ మొదలుపెట్టిందని, వీటితో విద్యార్థులు నిరభ్యంతరంగా పరీక్షలు రాయవచ్చని స్పష్టం చేశారు. హాల్ టిక్కెట్ల జారీ పేరుతో యాజమాన్యాలు గందరగోళ పరిస్థితులు సృష్టిస్తే కమిషన్ చట్టప్రకార చర్యలతో పాటు ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలకు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు సిఫార్సులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలుంటే apscpcr2018@gmail.com మెయిల్‌కు ఫిర్యాదులు చేయొచ్చని తెలిపారు.

మస్టర్ల నిర్వహణలో లోపాలు

ప్రజా వేదికలో సిబ్బందిపై డ్వామా పీడీ మండిపాటు



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

ప్రజాశక్తి - పొందూరు

ఉపాధి హామీ మస్టర్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై డ్వామా పీడీ బి.సుధాకరరావు సిబ్బందిపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ, పలు విభాగాల సమన్వయంతో చేసిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీలపై ప్రజావేదికను గురువారం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 29 పంచాయతీల్లో 1,125 పనులకు గానూ రూ.16.46 కోట్లు చెల్లింపులు చేసినట్లు చెప్పారు. ఇందులో వేతనాల రూపంలో రూ.13.30 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.3.15 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. మస్టర్ల నిర్వాహణలో లోపాలు, కొలతలలో తేడాలను గుర్తించినట్లు వెల్లడించారు. సుమారు 12 పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టలేదన్నారు. మస్టర్లలో సంతకాలు, వేలిముద్రలు లేకపోవడంతో పాటు మృతులకూ చెల్లింపులు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుంగపేటలో పనికి వెళ్లకుండానే మస్టర్లు ఎలా వేశారంటూ సర్పంచ్ పప్పల వేణుగోపాలరావు అధికారులను ప్రశ్నించారు. గోకర్ణపల్లిలో పని ప్రదేశంలో బోర్డులు ఏర్పాటు చేయలేదని తెలిపారు. పలు పంచాయతీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు చనిపోయినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి కిల్లి ఉషారాణి, ఎపిడి పి.రాధ, ఎంపిడిఒ మీసాల మన్మథరావు, డివిఒ స్వరూపారాణి, హెచ్‌ఆర్ శ్రావణ్‌కుమార్, ఎస్‌ఆర్‌పి పున్నపునాయుడు, ఎపిఒ పి.శ్రీనివాసరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, డిఆర్‌పిలు, మండల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విస్తృతస్థాయిలో వాహన తనిఖీలు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విస్తృతస్థాయిలో వాహన తనిఖీలు చేపట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయం, ఇచ్ఛాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. పోలీస్‌స్టేషన్, పరిసరాలు, పలు ముఖ్యమైన రికార్డులను, సర్కిల్ కార్యాలయంలో గ్రేవ్ కేసుల దర్యాప్తును క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది వివరాలపై ఆరా తీసి, అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో పేకాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిరంతరం దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో అరికట్టాలని సూచించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీ నిర్వహించి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అక్రమ రవాణాని అరికట్టే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఒడిశా సరిహద్దు పోలీస్, ఇతర అధికారుల సమన్వయంతో అక్రమ రవాణా, ఇతర నేరాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు సమాచారం సేకరించాలన్నారు. సర్కిల్ పరిధిలోని గ్రామాలు, ప్రస్తుత పరిస్థితుల గురించి ఆరా తీసి గ్రామాలను సందర్శించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా హెల్ప్ డెస్క్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సత్వరమే విచారణ చేసి న్యాయం చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు పటిష్టంగా పనిచేయాలన్నారు. వార్షిక తనిఖీల్లో కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు, సిఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాస్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

అక్రమ రవాణాపై నిరంతర నిఘా

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని పురుషోత్తంపురం వద్ద అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రాన్ని గురువారం పరిశీలించి పలు సూచనలు చేశారు. గంజాయి, మద్యం, నాటుసారా రవాణాపై నిరంతరం పటిష్ట నిఘా ఉండాలన్నారు. ఒడిశా నుంచి జిల్లాలోకి వీటిని రవాణా కాకుండా నిరోధించాలని చెప్పారు. అనంతరం ఎక్సైజ్ స్టేషన్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. నవోదయం-2పై పలు సూచనలు చేవారు. గ్రామాల్లో నాటుసారా అమ్మకాలపై గట్టి నిఘా పెట్టి ఆకస్మిక దాడులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారి సిహెచ్.తిరుపతినాయుడు, ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్, మొబైల్ సిఐ జి.వి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

మెళియాపుట్టిలోనే ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

జిల్లాల విభజన తరువాత శ్రీకాకుళానికి ఐటిడిఎ కోల్పోయిందని, ఎక్కువ శాతం గిరిజనులు ఉన్న మెళియాపుట్టి మండలంలో ఐటిడిఎ ఏర్పాలు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. అసెంబ్లీలో గురువారం నిర్వహించి ప్రశ్నోత్తరాల సమయంలో మరోసారి తన గళాన్ని వినిపించారు. ఈ సందర్భంగా మాజీ సిఎం ఎన్.రామరావు, సిఎం చంద్రబాబు హయాంలోనే హయాంలోనే ఐటిడిఎలు ఏర్పాటయ్యాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. డోలి మోతలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో 9 నెలల కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో రూ.60 కోట్లతో గిరిజన గ్రామాలకు రోడ్డు నిర్మించామని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా గిరిజనులు పండించిన పంటను నేరుగా అమ్మడానికి సంతను ఏర్పాటు చేయాలన్నారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో గిరిజనులకు ఐటిడిఎతోపాటు బతుకుతెరువునూ దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

నేడు బిఎస్‌ఎన్‌ఎల్ ఇయు జిల్లా మహాసభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ పదో జిల్లా మహాసభను నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఈనెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 పతాకావిష్కరణతో మహాసభ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆలిండియా ఉపాధ్యక్షులు కె.రమాదేవి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, కృష్ణబాలాజీ హాజరు కానున్నారని తెలిపారు. మహాసభ సందర్భంగా 'బిఎస్‌ఎన్‌ఎల్ మనుగడ-ఉద్యోగుల కర్తవ్యాలు' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.


మాట్లాడుతున్న డిఇఒ తిరుమల చైతన్య

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

డిఇఒ తిరుమల చైతన్య

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్‌లో గురువారం నిర్వహించిన కిడ్స్ కాన్వొకేషన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని సంస్థకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎం విలియం, ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రణీవౌరి, ఉపాధ్యాయులు తాళాను శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లా శరత్, చంద్రమౌళి, కె.రమణ, లింగరాజు, సూర్యతేజ, ఆనందీప్, మురళి, కళ్యాణి పాల్గొన్నారు.



అభినందిస్తున్న నాగేశ్వరరావు

'ఐతమ్' విద్యార్థులకు ఐఐఎం ప్రశంస

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగం ఆఖరి ఏడాదికి చెందిన విద్యార్థులు టంకాల యమున, బి. జయంత్, సాయికుమార్ జనా, టి.సంతోషికకు బెంగుళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) బెంగుళూరు ప్రశంసాపత్రాలను అందించినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఐఐఎం నిర్వహించిన జాతీయ స్థాయి బిజినెస్ ప్లాన్ ఛాంపియన్ షిప్ సదస్సులో ఐతమ్ విద్యార్థులు పాల్గొని అపారవు వినియోగంలో భాగంగా 'డయాఫ్యూర్' అనే నూతన ఆవిష్కరణ అంశంపై చేసిన పేపర్ ప్రజెంటేషన్‌ను గుర్తించి కన్సోలేషన్ బహుమతి (5వ) ప్రధానం చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌వోడి డాక్టర్ బి.శివకుమార్‌లు పాల్గొన్నారు.

ముగిసిన గ్రాండ్ టెస్టు

ప్రజాశక్తి - టెక్కలి

విద్యాశాఖ ఆధ్వర్యాన 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన గ్రాండ్ టెస్టు గురువారంతో ముగిశాయి. మూడు రోజుల సెలవు అనంతరం సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గ్రాండ్ టెస్టు పరీక్షల ముగింపు విద్యార్థుల్లో సంతృప్తినిచ్చింది. గత కొద్ది రోజుల క్రితం ప్రారంభమైన గ్రాండ్ టెస్టు ముగింపు నేపథ్యంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు మాట్లాడేందుకు అవకాశం కూడా లేని పరిస్థితి. పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు అనంతరం విద్యార్థులు పరీక్షల రాసే విధానంలో తప్పులను సమరిస్తూ విద్యార్థుల్లో తడుముకోకుండా దిద్దుకునేందుకు గతంలో అవకాశం ఉండేది. అయితే ఈ ఏడాది ప్రీ ఫైనల్ పరీక్షలు ముగిసిన కొద్దిరోజుల తర్వాత గ్రాండ్ టెస్టు నిర్వహించడంతో విద్యార్థులు పరీక్షలతోనే కుస్తీ పట్టాల్సిన పరిస్థితులు తలెత్తాయి. వాస్తవంగా శుక్ర, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో ఒక్క శనివారం మాత్రమే ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడేందుకు అవకాశం ఉంది.

పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


మాట్లాడుతున్న శివకుమార్

నగరపాలక సంస్థ పరిధిలో పెద్దఎత్తున ఇంటి, కొళాయి, విఎల్‌టి పన్నుల బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని వాటిని త్వరితగతిన వసూలు చేసేందుకు చర్యలు తీసు కుంటున్నట్టు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ వై.శివకుమార్ తెలిపారు. గురువారం ఆయన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలో సుమారు రెండున్నర లక్షలకుపైగా ఎసెస్‌మెంట్లు ఉన్నాయని, ఇళ్లు, దుకాణాలు, దుకాణ సముదాయాలు, ఖాళీస్థలాలు నుంచి పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది వీటి నుంచి రూ. 39.42 కోట్ల మేర బకాయిలు ఉన్నట్టు వివరించారు. ఇంతవరకు రూ.18 కోట్ల వసూళ్లు చేయడం జరిగిందని, ఈనెలాఖరులోగా నూటికి నూరు శాతం పన్నులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ప్రజలు నగరాభివృద్ధిలో భాగస్వామ్యులయ్యేందుకు సకాలంలో పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. పన్నుల వసూళ్ల కొరకు నగరంలో మూడు ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని, ప్రజలు స్వచ్ఛందంగా ఆ కౌంటర్లు వద్ద పన్నులు చెల్లించుకోవచ్చునని ఆయన సూచించారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ఇళ్ల పన్నులు వసూలు వేగవంతం చేయాలని కమిషనర్ ఎన్.రమేష్ సిబ్బందికి ఆదేశించారు. గురువారం మున్సిపల్, రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ఇంటి, నీటి పన్ను, ఖాళీ జాగా పన్నులను ఈ నెలాఖరులోగా శతశాతం వసూలు చేయాలన్నారు.

కొత్తూరు: ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని డిఎల్‌పిఒ గోపీబాల ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులపై దృష్టిసారించాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకర్లను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 60 శాతం పన్ను వసూలు అయ్యాయని, ఇంకా 40 శాతం వసూళ్లకు పూర్తి కావాల్సి ఉందని అన్నారు. అంతకుముందు కర్లెమ్మ సచివాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. ఈయనతో పాటు ఇఒపిఆర్‌డి వసంతకుమారి ఉన్నారు.

'108' తనిఖీ

పాతపట్నం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రి వద్ద 108 అంబులెన్స్‌ని డివిజనల్ అధికారి జి.జగన్ గురువారం తనిఖీ చేశారు. వేసవి కాలంలో వడదెబ్బలు, గుండె పోటులు, రోడ్డు ప్రమాదాలపై ఫోన్ వచ్చిన వెంటనే స్పందించాలని సూచించారు. వాహనంలు మందులు, ఇతర పరిసరలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈయనతో పాటు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కె.ఆఫీస్, పైలట్ డి.రాంబాబు ఉన్నారు.


తనిఖీ చేస్తున్న జగన్

జంట పట్టణాల్లోకి భారీ వాహనాల ప్రవేశం

- జటిలమవుతున్న ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోకి ఇటీవల కాలంలో ఎక్కువగా భారీ వాహనాలు ప్రవేశిస్తున్నాయి. ఇప్పటికే ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న ప్రజలకు ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతుంది. ట్రాఫిక్ సమస్యను పోలీసులు కనీస స్థాయిలో కూడా పట్టించుకోకపోవడం విడ్డూరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంట పట్టణాల్లో బైక్‌లు, ఆటోలు, కార్లు వంటి వాహనాలు అధికం కావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా తయారయ్యింది. దీనితో పాటు బస్సులు, లారీలు, చిన్నపాటి వాహనాలు రాకపోకలు కూడా ఎక్కువ కావడంతో ఏ పట్టణంలో లేనంత రద్దీ కాశీబుగ్గ కెటి రోడ్డులోనే కనిపిస్తుంది. 10,14, 16, 18, 20, 22, 24 చక్రాలు కలిగిన భారీ లారీ జీడిపిక్కల లోడు, హోల్‌సేల్ వ్యాపారులకు సరుకులు అందించేందుకు జంట పట్టణాల్లోకి ప్రవేశిస్తున్నాయి. వాస్తవానికి భారీ వాహనాలు పట్టణాల్లో ప్రవేశానికి, వెళ్లేందుకు ఉదయం 8 గంటలలోపు,


నిలిచిన వాహనాలు

రాత్రి 8 గంటల తరువాత మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ, ఆ నిబంధనలు ఎక్కడా పటించినట్టు కనిపించడం లేదు. చిన్నచిన్న 30, 40 రోడ్డుల్లో ఉన్న వీధుల్లోనూ పొక్లెయిన్లు, గోడౌన్లు ఏర్పాటు చేయడంతో లారీలు వచ్చి అక్కడ టర్నింగ్ తీసుకోవడానికి డ్రైవర్లు ఎంతో సాహసం చేయాల్సి వస్తుంది. ఈ సమయంలో ఇరు వైపులా గంటల కొద్ది వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు పాఠశాలలకు వచ్చే సమయంలో, క్యారేజులు తీసుకువెళ్లే సమయంలో, విద్యార్థులకు తిరిగి తీసుకువచ్చే సమయంలో ట్రాఫిక్ ఎక్కువ అవుతుంది. లక్ష్మీపురం టోల్ గేట్ తప్పించుకునేందుకు లారీలు బెండిగేటు మీదుగా పాతజాతీయ రహదారి వైపు ఎక్కువగా రాకపోకలు సాగుతున్నాయి. దీనిపై పోలీసులు కూడా బెండిగేటు టోల్ గేట్ ముందు ఒక సిబ్బందిని ఏర్పాటు చేసి కాశీబుగ్గ వైపు లారీలు రాకుండా అడ్డుకుంటామని చెప్పారు. కానీ, అది ఆచరణలో అమలుకాకపోవడంతో కాశీబుగ్గ పాతజాతీయ రహదారి నుంచి ఇతర ప్రాంతాలకు, జంట పట్టణాలకు యథావిధిగా లారీలు రాకపోకలు సాగుతున్నాయి. దీంతో అప్పుడప్పుడు పోలీసులు ఫొటోలు తీసి జరిమానాలు విధిస్తున్నారు తప్పితే శాశ్వత పరిష్కారం చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీనివాస లాడ్జి కూడలి నుంచి ఎంపిడిఒ కార్యాలయం వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య నిత్యం ఉంటుంది. ఈ రోడ్డులో ప్రయాణించాలి ప్రజలు అవస్థలు పడుతునే ఉన్నారు. గతంలో శ్రీనివాస లాడ్జి వద్ద ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉండి సమస్యను సరిచేసేవారు. ప్రస్తుతం ఆ కూడలిలో ట్రాఫిక్ కానిస్టేబుల్ కనిపించకపోవడంతో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పట్టణాల్లోకి భారీ లారీలు రాకుండా నియంత్రించాలని కోరుతున్నారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలు

ఇచ్ఛాపురం : పురుషోత్తపురం ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మార్కుల మెరిట్, రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, ఎంఇసి గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున కేటాయించామన్నారు. ఈ నెల 17 నుంచి 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒసి, బిసి, సిఇడబ్ల్యుఎస్‌లకు రూ.200, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బాలికలకు హాస్టల్ సదుపాయం, మినరల్ వాటర్ సౌకర్యం, స్టెమ్ లాబ్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ లాబ్, మాథ్స్ క్లబ్, సైన్స్ క్లబ్, విశాలమైన లైబ్రరీ, డిజిటల్ క్లాసెస్, విశాలమైన ఆట స్థలం, అనుభవం, అంకిత భావం కలిగిన అధ్యాపకులు ఉన్నారని తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో పురుషోత్తపురం ఆదర్శ జూనియర్ కళాశాల అని అన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్యదర్శులు

కార్యదర్శులకు పనిఒత్తిడి తగ్గించాలి

లావేరు: మండలంలోని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ గురువారం కార్యదర్శుల సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో ఎంపిడిఒ పి. వెంకట రాజు, ఇఒపిఆర్‌డి వి. విశ్వేశ్వర రావులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు కెల్ల రామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ పరిపాలనతో పాటు సచివాలయాల నిర్వహణ, ఇతర సర్వేలు, సమావేశాలతో కార్యదర్శులు తీవ్రంగా పని ఒత్తిడికి గురైతున్నామని సెలవు రోజుల్లో సర్వేల పేరుతో పని చేస్తున్నందున పలువురు కార్యదర్శులు అనారోగ్యాల బారిన పడి మానసికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లి తమకు పనిభారం తగ్గించాలని కోరారు.

ఉపాధ్యాయునిపై విచారణ

టెక్కలి: మండలంలోని పెద్దసాన ప్రాథమిక ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ఎలుగు ప్రసాద్ ప్రవర్తనశైలిపై డిఇఒ సదాశివుని తిరుమల చైతన్య గురువారం విచారణ చేపట్టారు. ప్రసాద్ మహిళా విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించడం, శరీర భాగాల్ని తాకడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి నేతాజీకి గతంలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టారు. విచారణలో ఉప విద్యాశాఖ అధికారి విలియం, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి పాల్గొన్నారు.


అభినందనలు తెలుపుతున్న ఝాన్సీ

ఎస్‌విజె విద్యార్థుల ప్రతిభ

కవిటి: కవిటి ఎస్‌విజె డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించినట్టు కరస్పాండెంట్ బి.కింగ్ తెలిపారు. మొదటి సంవత్సరంలో కె.అంకిత, పి.ప్రజ్ఞ, జి.భూమిక, వై.వాణి మంచి ప్రతిభ కనబరిచారన్నారు. మొత్తంగా 71.11 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బి.ఝాన్సీ, ప్రిన్సిపాల్ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

వ్యవసాయశాఖ ఎడి మధు


పలాస : మాట్లాడుతున్న మధు

ప్రజాశక్తి- పలాస

సేంద్రీయ ఎరువులు వినియోగంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పలాస వ్యవసాయశాఖ సంచాలకులు ఎల్.మధు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ప్రజాభాగసామ్య ప్రకృతి వ్యవసాయం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడకం ద్వారా వాటి నుంచి ఉతత్తులతో ఎక్కువ శాతం అనర్థాలు ఉన్నాయన్నారు. రసాయన ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. అందుకు సేంద్రీయ ఎరువులు వాడకాన్ని వినియోగించి అధిక దిగుబడులు సాదించాలన్నారు. వ్యవసాయ పొలంలో వరితో పాటు చిరుదాన్యాలు, దుంపజాతి, ఆకుకూరలు పండించుకునేందుకు అవకాశం ఉందన్నారు. అందుకు ఎకరా పొలంలో ఐదు సెంట్లు స్థలాన్ని కేటాయించి ఆరుతడి పంటలు వేయడం ద్వారా ఆదాయం సమకూర్చు కోవచ్చన్నారు. వరి వంటకు నష్టం వాటిల్లినా అంతగా రైతులు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వేసిన పంటలతో నిరంతరం ఆదాయం సమకూరుతుందన్నారు. రసాయన వంటలకు పెట్టుబడులు అధికంగా ఉంటుందని, సేంద్రీయ సాగుకు పెట్టుబడి అవసరం లేదని అన్నారు. సమావేశంలో ఎఒ పోలారావు, ఎపిఎం జాంభవతి, మహిళా కార్యదర్శి పార్వతి, చక్రవర్తి, శ్రీరామ్ కుమర్, లచ్చుమనాయుడు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండల సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై జిల్లా డిపిఎం రేవతి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సరస్వతి, చంద్రకళ, సిసిలు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జెమ్స్ ఆధ్వర్యాన అవగాహనా ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ భానుమూర్తి


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కిడ్నీ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆహారపు అలవాట్లు మార్చుకుని ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని జెమ్స్ వైద్య కళాశాల కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ భానుమూర్తి అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా జెమ్స్, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు గురువారం విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ వ్యాధులపై అందరికీ అవగాహన కల్పించే లక్ష్యంతో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ప్రతి ఏడాది మార్చి నెలలో రెండో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవంగా జరపడం జరుగుతుందన్నారు. మూత్ర పిండాలు రక్తం నుంచి వ్యర్థ ఉత్పత్తులను ఫిల్టర్ చేసి, ద్రవాలు, ఎలక్ట్రోలైట్లను సమతుల్యంగా ఉంచే ముఖ్యమైన అవయవమని అందువల్ల వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. మూత్రపిండ వ్యాధితో ఉన్న రోగులు పండ్లు, డ్రై ఫ్రూట్స్, జ్యూస్‌లు, మాంసం, విత్తనాలు, చిక్కుళ్లు, గింజలు, చేపలు వంటి అధిక మొత్తంలో భాస్వరం కలిగిన ఆహారాలను తీసుకోవడం నష్ట దాయకమన్నారు. నురగతో కూడిన మూత్రం, కళ్లు, కాళ్ల వాపు, అధిక రక్తపోటు, ద్రవ నిలుపుదల, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలు ఉన్న వారికి మూత్రపిండాల వ్యాధి సోకినట్టు గుర్తించి తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు డా. గౌతమి, జెమ్స్ ఆస్పత్రి మార్కెటింగ్ డిజిఎం విజయ భాస్కర్, కిమ్స్ ఆపరేషన్ మేనేజర్ రమేష్, బెండి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినులు టాటా క్యాపిటల్ పంక్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. తమ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఉప్పాడ భవాని, రేగులపాటి బాలామణి , చింతు అనుషలు ఈ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారని అన్నారు. ఈ స్కాలర్ షిప్ ద్వారా ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున మూడేళ్లు టాటా


అనూష బాలామణి భవాని

కంపెనీ అందజేస్తుందన్నారు. ఇంటర్ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా వీరిని ఎంపిక చేసినట్టు తెలిపారు. కళాశాల చైర్మన్ పల్లి సూరిబాబు, అకడమిక్ ఇన్‌ఛార్జి ఎం.శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

రుణాలకు దరఖాస్తుల స్వీకరణ

రణస్థలం: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతీ, యువకులకు కార్పొరేషన్ ద్వారా ఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన చంద్రన్న ఉపాధి పథకానికి గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాలని రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము కోరారు. గురువారం మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 21 నుంచి 60 ఏళ్లలోపు వయసు ఉన్న వారు వివిధ రంగాల నిరుద్యోగులకు బిసి కార్పొరేషన్ ద్వారా వివిధ రకాల యూనిట్లు స్థాపన కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. ఈ దరఖాస్తులు చేసుకొనుటకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులం, ఆదాయం సర్టిఫికెట్లను జత పరచాలని తెలిపారు. చివరి తేదీ ఈనెల 22తో ముగిస్తుందని, నిరుద్యోగ యువకులు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాము కోరారు.

పోలాకి: మండలంలోని నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకం ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 21 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల వెనుకబడిన తరగతులు, అగ్రవర్ణాల్లో పేదవారు ఈ రుణాలు మంజూరుకు ఈ నెల 22లోగా నమోదు చేసుకోవాలన్నారు. బి.ఫార్మసీ, డి ఫార్మసీ పూర్తి చేసిన నిరుద్యోగులకు జనరిక్ మందులు షాపులు స్థాపించుటకు రుణాలు మంజూరు చేస్తుందన్నారు. బిసి కార్పొరేషన్ రుణాలుకు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్ రమా పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు 'పది' పునాది


శ్రీకాకుళం అర్బన్ : సామగ్రిని అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థుల భవిష్యత్‌కు పదోతరగతి పునాది వంటిదని, ఉన్నత విద్యను అభ్యసించడానికి తొలిమెట్టుగా భావించి మంచి ఫలితాలు సాధించాలని ఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పిఎన్‌కాలనీలో గల న్యూసెంట్రల్ స్కూల్‌లో పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర కిట్లును గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదిలో మంచి మార్కులు సాధించి లక్ష్యాలను అందుకోవాలన్నారు. తల్లి దండ్రులకు, పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఏటా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్నానని ఆయన వివరించారు. కార్యక్రమంలో న్యూసెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.మల్లేశ్వరరావు, డైరక్టర్లు పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: మండలం కొయ్యాం జెడ్‌పిహెచ్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వెల్కమ్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అట్లలు, పెన్నులు తదితరమైన పరీక్షా కిట్లను న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ మేనేజర్ డా. మణికంఠ అందించారు. పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి అత్యుత్తమ మార్కులతో మెరవాలని, గురువులు చెప్పిన సూచనలను పాటిస్తే అది కష్ట సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో వెల్కమ్ సేవా ఫౌండేషన్ ప్రెసిడెంట్ ఎం.తాతారావు, వైస్ ప్రెసిడెంట్ బి.మురళీమోహన్, పాఠశాల హెచ్‌ఎం దయానంద్, ఫౌండేషన్ సభ్యులు అప్పారావు, ధర్మారావు, లక్ష్మణరావు, గోవింద, రామకృష్ణ, శంకరరెడ్డి, మూర్తి, సురేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని అంపలాం, సుసరాం, పోలాకి, గుప్పెడిపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు గురువారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు రెవాడ త్రినాథరావు మాస్టారు


పోలాకి : పరీక్ష సామగ్రిని అందజేస్తున్న సభ్యులు


ఎచ్చెర్ల : పంపిణీ చేసిన సామగ్రితో విద్యార్థులు, ఫౌండేషన్ సభ్యులు

మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఉత్తమ శ్రేణిలో నిలవాలని, కష్టపడి కాకుండా, అర్థం చేసుకొని ఇష్టపడి చదవాలని, అప్పుడే మీరు అనుకున్నది పూర్తిగా రాయగలరని అన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతూ అత్యున్నత స్థానంలో నిలవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బ్రహ్మం, బరాటం చంద్రశేఖర్, బరాటం రామారావు మాస్టారు (సాయిరాం), రఘు, వరప్రసాద్ పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని లగిదాస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సహకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు ఉపాధ్యాయులు తులసీప్రసాద్, ఆర్.రామారావు, బెందాళం రత్నం, గోవిందరాజులు, ప్రదర్శిని, దుంపల సుధారాణి పాల్గొన్నారు.


రోగిని తీసుకొస్తున్న పోలీసులు

రోగి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరుబుజ్జిలి మండలం నక్కలపేటకు చెందిన సనపల వరహానరసింహం ఆస్పత్రి మేడ మీద నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా పోలీసులు గురువారం కాపాడారు. వరహానరసింహం ఆస్పత్రి మేడ మీదకు వెళ్లి అక్కడ్నుంచి దూకేందుకు సిద్ధమయ్యాడు. అవుట్‌పోస్ట్ పోలీసులు తక్షణమే స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు రెండో పట్టణ సిఐ ఈశ్వరరావుకు సమాచారం ఇవ్వగా, శ్రీకాకుళం రూరల్ సిఐ పైడిపునాయుడు, సిబ్బందితో కలిసి ఆయన హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సమన్వయంతో, సమయస్ఫూర్తితో రోగిని కాపాడారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీస్, అగ్నిమాపక అధికారులు, సిబ్బందిని ఎస్‌పి మహేశ్వర రెడ్డి అభినందించారు.


నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో వ్యక్తి అరెస్టు

నరసన్నపేట : మండలంలోని దేవాది వద్ద గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్టు సిఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో గురువారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాది కూడలి వద్ద ఉదయం 9 గంటల సమయంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పరుగులు తీశారని అన్నారు. సిబ్బంది ఆయనను వెంబడించి పట్టుకున్నారని అన్నారు. ఆయన వద్ద నాలుగు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈయన ఒడిశా ప్రాంతానికి చెందిన షేక్ గుల్సన్‌గా గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


సుభద్రాపురం వద్ద జాతీయ రహదారిపై ఏర్పడిన గొయ్యి

మళ్లీ పడిన గొయ్యి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని సుభద్రాపురం కూడలిలో జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డులో గతంలో గొయ్యి ఏర్పడగా దానిని అధికారులు పూడ్చి వేశారు. అయితే మరలా పలక విరిగి గొయ్యి ఏర్పడింది. దీంతో తరచూ నిత్యం రద్దీగా ఉండే చోట ఇలా గొయ్యి ఏర్పడడంతో పలు వాహనదారులు గుంతల్లో పడుతూ గాయాల పాలవుతున్నారు. జాతీయ రహదారి అధికారులు ఈసారి గుంత పూడ్చి నాణ్యతా ప్రమాణాలు పాటించి పలక వేస్తే మరలా మరమ్మతులకు అవకాశం ఉండదని, అధికారులు వెంటనే స్పందించి గుంతను సరి చేసి ప్రమాదాలు జరుగకుండా చూడాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.

పలాసలోనే ఆర్‌టిఒ సేవలు అందించాలి

పలాస: పలాస కేంద్రంగా ఆర్‌టిఒలు సేవలు అందించాలని పలాస-కాశీబుగ్గ, రూరల్ మండల ఆటో యూనియన్ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ గతంలో పలాస ఆర్‌టిఒ కార్యాలయంలో డ్రైవర్లకు, వాహనాలకు అన్ని రకాల సేవలు అందేవిధంగా కార్యాకలాపాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఇటీవల ఎచ్చెర్ల తరలించడంతో అవస్థలు పడుతున్నామని అన్నారు. దీంతో రెండు వైపులా సుమారు 250 కిలోమీటర్లు దూరం వరకు ప్రయాణం చేసి ఆటోలకు ఫిట్నెస్ చేయించుకోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. దీనిపై ఉన్నతాధికారులు పున:పరిశీలించి గతంలో మాదిరిగానే పలాస కేంద్రంగా ఆర్‌టిఒ కార్యాలయ సేవలు అందించాలని కోరారు.

బోరు ఏర్పాటు

కొత్తూరు : వంశధార నిర్వాసిత కర్లమ్మ ఆర్అండ్ఆర్ కాలనీలో గురువారం బోరును ఏర్పాటు చేశారు. వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు రూ.1.5 లక్షల నిధులతో తాగునీరు బోరును మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుచ్చ అప్పారావు, మాజీ సర్పంచ్ పడాల వెంకట కృష్ణ, వైస్ సర్పంచ్ రేగన తవిటినాయుడు, గేదల శ్రీను, గుళ్లపటి ప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఎల్‌పిఒ ఐ.వి.రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి పరిస్థితుల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎస్ఐ సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, ఇఒపిఆర్‌డి పి.సింహాచలం, టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీ రంగనాయకులు, ఇఒ మోహన్‌బాబు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగను పంపిణీ చేస్తున్న డిఎల్‌పిఒ రమణ


మాట్లాడుతున్న శంకరశర్మ

కళారంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంతరించిపోతున్న కళలను కాపాడుతూ పురాతన ఆచార వ్యవహారాలను భావితరాల వారికి తెలియజేయాలని శ్రీ సుమిత్ర కళాసమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర శర్మ అన్నారు. నగరంలోని చిన్నబజారు రోడ్డులో ఉన్న వాసవి కళ్యాణ మండపంలో విలేకరుల సమావేశంలో ఆయన గురువారం మాట్లాడారు. ముందుగా నాటిక పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు శ్రీకాకుళమని, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అందులో భాగంగా గడచిన పదేళ్లుగా రంగ స్థల కళాకారుల దినోత్సవాన్ని సమితి ఆధ్వర్యాన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ ఏడాది కూడా నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆరు నాటికలు ప్రదర్శించనున్నామని తెలిపారు. అనంతరం చివరిలో ప్రముఖ హాస్య సినీ, టీవీ నటుడు జబర్దస్ అప్పారావు ఆధ్వర్యంలో హాస్యవల్లరి ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పోటీలకు సహకరించిన దాతలందరికీ శ్రీ సుమిత్ర కళాసమితి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నక్క శంకరరావు, మండవిల్లి రవి, గుత్తు చిన్నారావు, కొయ్యాన మురళీధర్, పార్థసారధి, కిల్లాన ఫల్గుణరావు, మెట్ట పోలినాయుడు, సురేష్, వరలక్ష్మీ, తమ్మినేని ఉషారాణి, పూజ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారాయణరావు

డ్వాక్రా ఉత్పత్తులకు ప్రోత్సాహం

డిపిఎం నారాయణరావు

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడమే కాకుండా ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ.1.20 లక్షలు ఆదాయం సమకూర్చేందుకు డ్వాక్రా ఉత్పత్తులను తయారు చేసి అమ్మకాలు చేపడుతుందని జిల్లా జీవనోపాధుల డిపిఎం బి.నారాయణరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో ఉన్న డ్వాక్రా ఉత్పత్తుల తయారీదారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 36,760 డ్వాక్రా సంఘాల నుంచి రూ.45 లక్షలు ఆన్‌లైన్ వ్యాపారం చేస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచి వ్యాపారం చేయిస్తున్నామన్నారు. అందుకు ప్రజలు డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సాహం అందించాలన్నారు. ఉత్పత్తులకు నాణ్యతోపాటు, గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో 8 వేల మంది నియమించామన్నారు. కార్యక్రమంలో సొంపేట, టెక్కలి క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ సిహెచ్. రామ్మోహన్, శ్రీరాములు, సాగర్, ఎపిఎం జాంభవతి పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్ అందిస్తున్న సభ్యులు

వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటు

ప్రజాశక్తి- కవిటి

చదువులో చురుగ్గా ఉండి తల్లి, తండ్రిని కోల్పోయి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తోడ్పాటు అందించడమే తమ లక్ష్యమని విద్యా వికాస్ కో-ఆర్డినేటర్ బొర్ర ప్రకాశరావు తెలిపారు. బొరివంక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బి.పూర్ణిమకు విద్యా వికాస్ స్కాలర్ షిప్ కింద రూ.7 వేలు అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ సదుద్దేశంతో విద్యా వికాస్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్ బెందాళం శ్రీపతి సౌమ్య, విద్యా వికాస్ కో-ఆర్డినేటర్ దేవేంద్రరౌలో, సభ్యులు నొడియా దుదిస్టి, పార్నంది నాగేశ్వరరావు, ఎన్ని రవికుమార్ పాల్గొన్నారు.

కంప్యూటర్లు వితరణ

టెక్కలి : మండలంలోని తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం దేవి సీ ఫుడ్స్ సౌజన్యంతో బిగ్ హెల్ప్ ఆధ్వర్యాన కంప్యూటర్లు, ప్రింటర్లు వితరణ అందజేశారు. సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు, రాళ్లపేట మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు రూ.80 వేలు విలువైన రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. కార్యక్రమంలో బిగ్ హెల్ప్ చైర్మన్ సి.వి.రాజా, జోనల్ డైరెక్టర్ జయకృష్ణ, మాజీ సర్పంచ్ పరపతి చిన్నయ్యరెడ్డి, బిగ్‌హెల్ప్ డైరెక్టర్ రామమునిరమేష్‌కుమార్, చైర్మన్ నేపాలం కృష్ణారావు, డోనర్స్ బి.విద్యావతి, బి.లత, హనుమంతు శివానంద్ పాల్గొన్నారు.

ఒత్తిడి వద్దు... 'పది'ని జయించు

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి జరగబోయే పరీక్షలకు విద్యార్థులు రెడీగా ఉన్నట్లే కనిపిస్తోంది. అయితే ఈ పరీక్షల్లో తెలిసో తెలియకో చిన్న చిన్న పొరపాట్లు చేయడం వల్ల భారీ మూల్యం చేలించాల్సి ఉంటుంది. కాబట్టి ముందుగా తగు సూచనలు తెలుసుకుని పరీక్షా కేంద్రానికి చేరుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు.



విద్యార్థులకు కొన్ని సూచనలు...

పరీక్షలు రాసేవారిలో ఎక్కువ మంది ప్రశ్నాపత్రం ఇచ్చిన ఐదు నిమిషాల్లోనే జవాబులు రాయడం స్టార్ట్ చేస్తారు. అలా చేయకూడదు. ముందుగా ప్రశ్నలను పూర్తిగా చదవాలి. తర్వాత అడిగిన ప్రశ్నకు ఎన్ని మార్కులు.? జవాబు ఎంత మేరకు రాయాలో ముందుగానే నిర్ణయించుకుని మొదలుపెట్టాలి.

మొదట ఏ ప్రశ్నకు సమాధానం సులభంగా రాయగలరో వాటినే రాయాలి. ప్రశ్నల నంబర్లను తప్పుగా రాయడం, మరచిపోవడం వంటివి చేయకూడదు. అన్ని జవాబులు రాశాక మరోసారి వాటికి ప్రశ్న నంబర్లు రాశారో లేదో ఒకసారి చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం.

ప్రశ్నాపత్రంలో ఛాయిస్ ఉన్నప్పుడు వాటి ఎంపిక సరిగ్గా ఉండేలా చూసుకోండి. కఠినంగా ఉన్న ప్రశ్నలను చూసి ఆందోళన చెందొద్దు. ముందుగా సులభంగా ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాసి తర్వాత కఠిన ప్రశ్నలకు జవాబులు రాయండి.

ముఖ్యంగా చేతి రాత బాగుంటేనే పేపర్ దిద్దే ఉపాధ్యాయుడికి మీ పేపర్‌పై మంచి ఇంప్రెషన్ ఏర్పడుతుంది. మీరు రాసే జవాబులను మంచి భావనతో చదువుతారు.కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకుండా జాగ్రత్త పడండి. చివరి నిమిషం వరకు రాస్తూనే ఉండ కూడదు. 10-15 నిమిషాల ముందే పరీక్ష రాయడం పూర్తి చేసి, జవాబు పత్రాన్ని మళ్లీ ఒకసారి చెక్ చేసుకునేలా ప్లాన్ చేసుకోండి.

సమయం వృథా కానివ్వకూడదు...

పరీక్షా హాల్‌లో ముందుగా ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదువుకుని తెలిసిన వాటికి వెంటనే సమాధానాలు రాయాలి. తెలియని వాటిని చివరలో కాస్త ఆలోచించుకుని సమాధానాలు రాయొచ్చు. దీనివల్ల సమయం వృథా కాకుండా ఉంటుంది.

పరీక్షలకు మీకు కాస్త సమయం ఉంటే.. తప్పకుండా ప్రీఫైనల్స్ పరీక్షలు వంటివి రాయడం మంచిది. ఎందుకంటే ఇవి రాయడం వల్ల సమయ నిర్వహణ అలవడుతుంది.

పాత ప్రశ్నాపత్రాలను సాధన చేయడానికి ప్రాధాన్యమివ్వాలి. మొదట్లో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయడానికి సమయం సరిపోకపోవచ్చు కూడా. కానీ, క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల నిర్ణీత వ్యవధిలోనే అన్నింటికీ సమాధానాలు రాయగలుగుతారు. వార్షిక పరీక్షలను సమర్థంగా రాయడానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది.

అన్న వితరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని నిరుపేదల ఆకలి తీర్చాలన్న ఆలోచనతో మథర్స్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యాన అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా వివిధ వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని వృధా కానీయకుండా సేకరించి వీరికి అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం ఎచ్చెర్ల మండలం కేశవరావుపేట గ్రామానికి చెందిన పైడి కిరణ్, సునీత ఇంట్లో జరిగిన పెళ్లి వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి నగరంలోని దమ్మల వీధిలో నివాసముంటున్న 30 పేద కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో డా.పైడి ప్రదీప్, అనిల్, రానా, అప్పన్న, దొడ్డ పాల డిస్ట్రిబ్యూటర్, మాజీ బిఎస్‌ఎఫ్ ఉద్యోగి జగదీశ్వరరావు ఆటోలో తీసుకువెళ్లి అందజేశారు.


ఆహారాన్ని అందజేస్తున్న ప్రదీప్


ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న రామ కౌండిన్య

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్ : దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించిన ఐక్యం-2025 నృత్యోత్సవాల్లో రామకౌండిన్య కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహూతుల ప్రశంసలందుకుంది. పద్మభూషణ్ స్వప్నసుందరి ఐక్య నృత్యోత్సవంలో భాగంగా ఆయనకు అరుదైన అవకాశం దక్కింది. నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు రఘుపాత్రుని శ్రీకాంత్ బృందం తరపున ఆయన ఈ ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రం నుంచి ఈ ప్రదర్శనకు ఆయనకే అవకాశం దక్కింది. నృత్యోత్సవానికి సీనియర్ ఐఎఎస్ అధికారి రుచిక కట్యాల్ హాజరై స్వప్నసుందరితో కలిసి కౌండిన్యను సత్కరించారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిబాబు నాయుడు

రుణ యాప్‌లపై అప్రమత్తం

సోంపేట : లోన్ యాప్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు సూచించారు. స్థానిక కొర్లం జాతీయ రహదారి కూడలి వద్ద గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేని రుణ యాప్‌లపై జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనలు పాటించకుండా ఎక్కువ వడ్డీలు వసూలు చేయడం, వేధింపులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలేయ సమస్యపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కాలేయ వ్యాధితో బాధపడుతున్న రోగులకు నగరంలోని డేఅండ్‌నైట్ వద్ద గల ప్రశాంత్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రి ఆవరణలో గురువారం ఉచిత వైబ్రో స్కానింగ్ పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ గ్యాస్ట్రో అంట్రాలజిస్టు ఆర్.ప్రశాంత్ హాజరై ఈ పరీక్షలు నిర్వహించారు. జూనియర్ చాంబర్స్ సహకారంతో చేపట్టిన ఈ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ హెపటైటిస్ లక్షణాలు కనిపించేటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు. కాలేయానికి ఐదు రకాల వైరస్‌ల వల్ల ఇన్‌ఫెక్షన్ సోకుతుందని, దీనివల్ల లివర్ కేన్సర్ రావడానికి వీలుందన్నారు. సకాంలలో వైద్య సేవలు పొందడం వల్ల ఈ సమస్య రాకుండా జాగ్రత్త పడొచ్చని ఆయన సూచించారు. ఈ శిబిరంలో జెసిఐ మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించి కలుషిత నీరు, కలుషిత ఆహానికి దూరంగా ఉంటే కాలేయ వ్యాధులు రానీయకుండా జాగ్రత్త పడొచ్చున్నారు. ఎల్లప్పుడు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ డెవలప్మెంట్ జోన్ డైరెక్టర్ బి. దిలీప్ కుమార్, జెసిఐ వ్యవస్థాపకులు డా.జామి భీమ శంకర్, జోన్ కో-ఆర్డినేటర్ బి.వరలక్ష్మి, సెక్రటరీ టి.ఉషారాణి, ట్రెజరర్ బోడిగి మధు, మండవల్లి రవి, లావణ్య క్లినిక్ స్పెషలిస్ట్ బెజ్జం వినయ్ తదితరులు పాల్గొన్నారు.



కాలేయ పరీక్షల శిబిరంలో పాల్గొన్న వైద్యులు ప్రశాంత్


సమీక్షిస్తున్న కమిషనర్ రామారావు

తాగునీటి సరఫరాకు ప్రణాళిక

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుందని, ఈ ఏడాది తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని కమిషనర్ ఎన్.రామారావు, పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ రాయిల్బాబు, ఇఇ సుగుణాకరరావు తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో గురువారం తాగునీటి ఎద్దడ నివారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు నీటిని పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు మళ్లించేందుకు ఇప్పటికే ఎమ్మెల్యే గౌతు శిరీష డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. అందులో భాగంగానే ఉద్దానం ప్రాజెక్టు తాగునీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఒక వైపు ఉద్దానం నీటి ప్రాజెక్టు అధికారులతో చర్చించడం, సమావేశంలో డిఇ కనకరాజు, ఎఇ కిరణ్‌కుమార్, మహేష్, అలేఖ్య పాల్గొన్నారు.

సహజ రంగులతోనే హోలీ

పలాస : కృత్రిమ రసాయనాలతో కష్టాలు కొని తెచ్చుకోవద్దని, సహజ రంగులతో హోలీ నిర్వహించుకుని ఆనదంగా గడపాలని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.రమణ సూచించారు. హరిత దళ క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన సహజ రంగుల ఆవశ్యకత, కృత్రిమ రంగులు వాడకం వల్ల కలిగే నష్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగ అంటే ఉత్సాహాన్ని ఇవ్వాలని, కృత్రిమ రసాయనాలు వంటి రంగులు వాడకం వల్ల వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఓపిక తెచ్చుకొని ఇంట్లోనే సహజ ఔషధ గుణాలు కలిగిన రంగులు తయారు చేసుకొని హోలి పండగ నిర్వహించుకుని ఆస్వాదించాలన్నారు. అనంతరం ఇదే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎన్‌టిటిపిసి సమన్వయకర్త కొయ్యల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధుబాబు, పద్మలోచన, జనార్థన, పద్మ శివప్రసాద్, యామిని, కిషోర్, రజనీకుమారి, జోతమ్మ అరుణ కుమారి, కృష్ణవేణి, చిన్నారావు, లక్ష్మీబాయి, కృష్ణాచారి, రవితేజ, కోటేశ్వరరావు, తులసీరాణి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రమణ


మొల్ల చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న అనురాధ

ఘనంగా 'మొల్ల' జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సామాన్యులకు సైతం రామాయణాన్ని అర్థమయ్యే రీతిలో తెలుగులో రచించిన గొప్ప రచయిత్రి మొల్ల వెంగమాంబ అని బిసి సంక్షేమ అధికారి ఇ.అనూరాధ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కవయిత్రి మొల్ల జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషపై ఆమెకు ఉన్న గౌరవాన్ని గుర్తు చేశారు. సామాన్య ప్రజలు మాట్లాడుకునే సరళమైన భాషతో ఆమె రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారితో పాటు బిసి సంక్షేమ శాఖ ఉద్యోగులు వీరస్వామి, ఎర్రన్న, స్వామి, మల్లేసు, సూర్యనారాయణ, గణపతి, సత్యం తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పనిభారం తగ్గించాలని వినతి

కోటబొమ్మాళి : మండలంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌ను, ఇఒపిఆర్‌డి జె.ఆనందరావులను గురువారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. వివిధ లాగిన్‌లు, యాప్‌ల నిర్వహణ, పలు పంచాయతీల్లో ఇన్‌ఛార్జిగా వ్యవహరించడంతో పని భారం ఎక్కువ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.బి.రమేష్, వి.రమేష్, బి.సతీష్, ఎం.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్‌ఆర్‌పి పున్నపునాయుడు

సామాజిక తనిఖీలకు సహకరించాలి

ప్రజాశక్తి- లావేరు

మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉపాధిహామీ పథకంలో రూ. 25.60 కోట్లతో జరిగిన పనులకు ఈనెల 14 నుంచి 27 వరకు గ్రామాల్లో నిర్వహించనున్న సామాజిక తనిఖీలకు అందరూ సహకరించాలని ఎస్‌ఆర్‌పి ఇ.పున్నపు నాయుడు అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు, డిఆర్‌పిలతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక తనిఖీలకు గ్రామాల్లో ఎనిమిది డిఆర్‌పి బృందాలతో సర్వే చేపడతారని, ఈ సర్వేకు ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు సహకారాన్ని అందించి తగిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకట రాజు, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఎపిఒ ఆర్.సత్యవతి, డిఆర్‌పిలు, కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

వేలంలో రూ.11.89 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు పంచాయతీకి సంబంధించి గురువారం నిర్వహించిన వేలం పాటలో రూ.11,89,000 ఆదాయం సమకూరింది. పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంలో మార్కెట్ ఆశీలు రూ.11,10,000, ఆటోస్టాండ్ రూ.23, 500, కమేళా రూ.55, 500కు దక్కించుకున్నారు. గతేడాది వేలం పాటలో రూ.9,32,000 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.1,78,000 అధికంగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, డిఎల్‌పిఒ ఐ.వి.రమణ, మండల అధ్యక్షులు రామ్మోహన్, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఇఒ మోహన్ బాబు పాల్గొన్నారు.

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- పోలాకి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బిసి సంక్షేమ సంఘం ద్వారా మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఎంపిడిఒ జి.రవికుమార్ తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 50 ఏళ్ల వరకు వరకు మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇఒపిఆర్‌డి పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు, జూనియర్ అసిస్టెంట్ రమా తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ కాలనీలో తాగునీటికి ఇక్కట్లు

టెక్కలి రూరల్ : టెక్కలి శ్రీరామ కాలనీలో తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు ప్రకటనలో తెలిపారు. ఇటీవల టెక్కలి పంచాయతీ ఇఒకి మెమోరాండం ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈయనతో పాటు కొల్లి యల్లయ్య తదితరులు ఉన్నారు.